
ప్రజాశక్తి

శనివారం 19 జులై 2025

5

పార్వతీపురం మన్యం



ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఉచిత శిక్షణ

పార్వతీపురం: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతీ, యువకులను పారిశ్రామికవేత్తలుగా అభివద్ధి చెందడానికి ర్యాంప్ (Raising and Accelerating MSME Programme) పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటన తెలిపారు. ఈ పథకంను థ్రెడ్జ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో వ్యవస్థాపకత, నైపుణ్య అభివద్ధిపై శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ శిక్షణా తరగతులు నెల రోజుల పాటు కురుపాం, పాలకొండ, సాలూరులో నిర్వహిస్తామన్నారు. సూక్ష్మ, మధ్య, చిన్న తరహా పరిశ్రమల స్థాపనపై అవగాహన, ప్రాజెక్టు తయారీ, పథకాల వివరాలు, ఉత్పత్తి, మార్కెటింగ్ తదితర అంశాలపై పరిజ్ఞానం, అవగాహన కల్పిస్తామన్నారు. వివరాలకు పాలకొండ : 8985922855, సాలూరు : 93815 51258, కురుపాం : 95421 49076, జిల్లా కో-ఆర్డినేటర్ : 98851 17831 (జి.అరుణ్ కుమార్) నంబర్లకు సంప్రదించవచ్చని ఆ ప్రకటనలో తెలిపారు.

ఎఎన్ఎంల బదిలీల్లో గందరగోళం

- 27ఏజెన్సీ సచివాలయాలకు ఎఎన్ఎంలు కరువు
- రిలీవర్లు రాకపోవడంతో నిలిచిన బదిలీలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఇటీవల జరిగిన ఎఎన్ఎంల బదిలీల్లో గందరగోళం నెలకొంది. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన సచివాలయం ఎఎన్ఎంల బదిలీ ప్రక్రియ జరిగింది. మన్యం జిల్లాలో 530 సచివాలయ ఎఎన్ఎంలకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి ఎంపిక చేసుకున్న ప్రదేశానికి బదిలీ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపిక చేసుకున్న ప్రదేశానికి మూవ్‌మెంట్ ఆర్డర్ లిచ్చారు. అంతవరకు బాగానే ఉంది. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న సచివాలయ ఎఎన్ఎంలు మైదాన ప్రాంతానికి బదిలీపై వచ్చారు. అయితే ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న సచివాలయాలకు వెళ్లడానికి ఎవరూ ఆసక్తి చూపలేదు. దీంతో 27 సచివాలయాలకు ఎఎన్ఎంలు లేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన జిల్లా అధికారులు బదిలీపై వెళ్లిన వారికి మూవ్‌మెంట్ ఆర్డర్ లిచ్చి నిలిపివేశారు. ఈనెల 9న కొంతమంది ఎఎన్ఎంలకు మూవ్‌మెంట్ ఆర్డర్ లిచ్చారు. 11న కొంతమందికి మూవ్‌మెంట్ ఆర్డర్లు అందజేశారు. బదిలీపై వెళ్లిన వారి స్థానంలో ఎఎన్ఎంలు వస్తే గాని వారిని విడుదల చేయొద్దని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి భాస్కరరావు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు రిలీవర్ రాని చోట్ల నుంచి ఎఎన్ఎంలను విడుదల చేయలేదు. దీంతో ఎఎన్ఎంల బదిలీ ప్రక్రియ సందిగ్ధంలో పడింది. తమ స్థానాల్లో ప్రత్యామ్నాయ ఎఎన్ఎంలు రాకపోవడంతో బదిలీలు నిలిచిపోయాయని



కలెక్టర్‌కు వినతిని ఇచ్చేందుకు వచ్చిన ఎఎన్ఎంలు

కొంతమంది ఎఎన్ఎంలు ఆందోళన చెందుతున్నారు. పాచిపెంట, తోణాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న సచివాలయాలకు వెళ్లడానికి ఎఎన్ఎంలు ఆసక్తి చూపని కారణంగా అవి ఖాళీగా వుండిపోయాయి. ఉమ్మడి జిల్లాలో కొన్ని సచివాలయంలో ఇద్దరు, ముగ్గురు ఎఎన్ఎంలున్న పరిస్థితి కనిపిస్తోంది. ఏజెన్సీ ప్రాంతంలో పని చేయడానికి ఎవరూ ఆసక్తి చూపని కారణంగా అక్కడి సచివాలయాలు ఖాళీగా ఉండిపోయాయి. నిబంధనల ప్రకారం ఏజెన్సీ ప్రాంత సచివాలయాల నుంచి బదిలీ అయిన ఎఎన్ఎంలకు మూవ్‌మెంట్ ఆర్డర్ లిచ్చి మళ్లీ పెండింగ్‌లో పెట్టారు.

సమస్య పరిష్కరించాలి: సిఐటియు

సచివాలయ ఎఎన్ఎంల బదిలీ ప్రక్రియలో నెలకొన్న గందరగోళం సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన శుక్రవారం ఎఎన్ఎంలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్వో హేమలతకు వినతిపత్రం అందజేశారు. మూవ్‌మెంట్ ఆర్డర్ లిచ్చిన వారి ప్రదేశంలో ఎఎన్ఎంలు లేరనే కారణంతో వారిని విడుదల చేయకపోవడం సరికాదన్నారు. అధికారుల ముందుచూపు లేని కారణంగా ఏర్పడిన గందరగోళానికి వారే పరిష్కారం చూపించాలని డిమాండ్ చేశారు. వినతిని అందజేసిన వారిలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, గ్రేడ్-3 ఎఎన్ఎంల సంఘం నాయకులు రమాదేవి, గౌరవాధ్యక్షులు వి.ఇందిర ఉన్నారు.

సుపరిపాలనలో తొలి అడుగు ఇదేనా?

- ఎన్నాళ్లీ కలుషిత నీరు తాగమంటారు?
- జనం కష్టాలు ఎమ్మెల్యేకు కనిపించవా?
- పట్టణ వాసుల ఆవేదన

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా కేంద్రంలో గల పేద, మధ్యతరగతి ప్రజలకు స్థానిక పాలకులు చుక్కలు చూపిస్తున్నారు. గత కొద్ది నెలలుగా పట్టణ వాసులకు సురక్షిత తాగునీటి సరఫరా చేయడం లేదు. పేద, మధ్యతరగతి ప్రజలు నివశించే వార్డుల్లో ఇంటింటికీ కలుషిత తాగునీరే సరఫరా చేస్తున్న పరిస్థితి నెలకొంది. ఈ సమస్య పరిష్కరించాలని ప్రజాసంఘాలు, స్థానిక నాయకులు కోరుతున్నా పట్టించుకోవడం లేదు. రక్షిత మంచినీటి సరఫరా చేయాల్సిన మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తున్నారు. వైసిపికి చెందిన మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి సిఫార్సులను కమిషనర్ వెంకటేశ్వర్లు పట్టించుకున్న దాఖలాలు లేవు. మున్సిపాలిటీలో తాగునీటి సరఫరాకు సంబంధించిన రూ.63 కోట్లుతో ప్రాజెక్టు పనులు ప్రారంభం కాలేదు. దశాబ్దాల క్రితం నాటి తాగునీటి సరఫరా పైపులైన్ వ్యవస్థ వుండడంతో అక్కడక్కడ లీకుల వల్ల ప్రజలకు కలుషిత నీరు సరఫరా అవుతోంది. మురుగునీరే తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. శుక్రవారం 30వ వార్డులో ప్రజలకు మురుగు నీరు సరఫరా జరిగింది. దీంతో మహిళలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అసలే వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కలుషిత నీరు తాగి ఎలా బతకాలని మహిళలు ప్రశ్నిస్తున్నారు.



కుళాయి ద్వారా వచ్చిన మురికినీటిని బాటిల్‌లో నింపి చూపుతున్న మహిళలు



కుళాయిల ద్వారా వస్తున్న బురదనీరు

ఎమ్మెల్యేకు పట్టని తాగునీటి సమస్య

గత ఏడాది కాలంగా పురపాలన అస్తవ్యస్తంగా తయారైంది. మున్సిపల్ అధికారులు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కనుసన్నల్లో పని చేస్తున్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పట్టణంలో తిరుగుతున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని ఆయన దృష్టికి తీసుకెళ్తున్నారు. గత కొంతకాలంగా మురుగునీరు సరఫరా అవుతున్న విషయం కూడా ఆయనకు తెలుసు. కానీ ఆయన స్పందించిన దాఖలాలు లేవు. ఏడాదిలో గొప్ప అభివృద్ధి పనులు చేశామని ఇంటింటికీ తిరుగుతున్న ఎమ్మెల్యే పట్టణ సమస్యల పరిష్కారానికి ఏమాత్రం చొరవ చూపడం లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

కార్మికుల శ్రమను దోచుకుంటున్న ప్రభుత్వం

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న అన్ని విభాగాల కార్మికుల శ్రమను ప్రభుత్వం దోచుకుంటుందని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె సుబ్బరావమ్మ విమర్శించారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ సింహాచలం అధ్యక్షతన శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన జిల్లా సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గతంలో 17 రోజులు సమ్మె సందర్భంగా మున్సిపల్ అధికారులు ప్రభుత్వం చేస్తున్న నిర్ణయాలకు జీవోలు వెంటనే విడుదల చేయాలన్నారు. కార్మికులకు రిటైర్మెంట్ వయస్సు పెంచాలని, మరణిస్తే ఇస్తున్న నష్టపరిహారం పెంచాలని, దహన సంస్కార ఖర్చులు పెంచాలని, చనిపోయిన వారి కుటుంబాలకు ఉద్యోగాలిచ్చే జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇంజినీరింగ్ కార్మికులు వేతనాలు పెంచాలని పోరాడుతుంటే మంత్రులు ఆలయాపన చేస్తున్నారని, వెంటనే వేతనాలు పెంచి కార్మికుల ఆదుకోవాలని, 12వ పిఆర్‌సిని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని, అలాగే రాష్ట్రంలోని అన్ని వర్గాల కార్మిక వర్గానికి పిఆర్‌సిని వర్తింపజేసి వేతనాలు పెంచాలని కోరారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.25 వేలు లోపు వేతనం పొందుతున్న కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ జిల్లాలో మూడు పట్టణాల్లో కార్మికులు తీవ్రమైన పని ఒత్తిడికి గురవుతున్నారని, కార్మికులను పెంచాలని పెండింగ్లో ఉన్న స్థానిక సంస్థలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.రమణారావు, వై.మన్మథరావులు మాట్లాడుతూ కార్మిక వర్గం సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యమైన వైఖరి విడనాడి కార్మిక రక్షణ చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షులు పి.సన్యాసిరావు, నాయకులు ఎన్.శంకర్రావు, శివ, పాలకొండ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు వేణు, సంజీవి, సాలూరు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు రాముడు, శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.

చిరుద్యోగుల పొట్ట కొట్టడమే సుపరిపాలనా?

స్త్రీ, శిశు, గిరిజన సంక్షేమ శాఖల్లో అవినీతిపై చర్యలేవీ?

మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గంలో చిరు ఉద్యోగుల పొట్ట కొట్టడమే సుపరిపాలనలో తొలి అడుగా అని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర ధ్వజమెత్తారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మంత్రి సంధ్యారాణి అరాచకాలపై ఫైర్ అయ్యారు. గడచిన ఏడాది కాలంలో నియోజకవర్గంలో ఎక్కడా లేని విధంగా చిరుద్యోగులపై వేధింపులు, తొలగింపులు జరిగాయని ఆరోపించారు. కెజిబివి,మోడల్ పాఠశాలల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నిర్ధాక్షిణ్యంగా తొలగించారని చెప్పారు. కుటుంబ పోషణ కోసం ఏదో ఒక ఉద్యోగం వచ్చిందని సంతోషంగా బతుకుతున్న వారి జీవితాలను బుగ్గిపాలు చేయడం సరైన విధానం కాదన్నారు. స్త్రీ, శిశు సంక్షేమశాఖలో సూపర్‌వైజర్ల బదిలీలకు ఇష్టారాజ్యంగా లంచాలు వసూలు చేసినట్లు, గిరిజన సంక్షేమ శాఖలో పదోన్నతులు ఇవ్వడానికి ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలు వచ్చాయని, వాటిపై మంత్రి ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు ఎవర్ని తీసేయమంటే వారిని తొలగిస్తారా అని ప్రశ్నించారు. ఈ ఏడాదిలో నియోజకవర్గంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, విఒఎలు కెజిబివి, మోడల్ పాఠశాలల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించడంలో మంత్రి సంధ్యారాణి కీలకపాత్ర పోషించారని విమర్శించారు. ఆమె మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రే కాకుండా చిన్న చిన్న ఉద్యోగుల తొలగింపు శాఖకు మంత్రిగా పని చేస్తున్నారా అన్న అనుమానాలు కలుగుతున్నాయని ఆయన చెప్పారు. ఆమె తొలగించిన చిరుద్యోగుల్లో ఎక్కువ మంది ఎస్సీ, ఎస్టీ, బిసిలకు చెందిన వారేనని చెప్పారు.

కెజిబివి ఎస్ఒ పిటిజి ఉద్యోగిని మానవత్వం లేదా?

మండలంలోని కరాసువలస కెజిబివి ఎస్ఒ ప్రశాంతి పిటిజి తెగకు చెందిన గిరిజన యువతి అని, పేద కుటుంబంలో పుట్టి పెరిగి ఉన్నత విద్య అభ్యసించిన తర్వాత ఉద్యోగం సాధించిందని చెప్పారు. అలాంటి ఉద్యోగిని సస్పెండ్ చేయడానికి జిల్లా అధికారులకు మానవత్వం లేదా అని ప్రశ్నించారు. అధికారుల విచారణలో కూడా ఎస్ఒ తప్పు లేదని నివేదించిన పుడు ఎలా చర్యలు తీసుకుంటారని నిలదీశారు. జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంలో తగిన చర్యలు తీసుకోకపోతే న్యాయ పోరాటానికి సిద్ధంగా ఉన్నామని రాజన్నదొర స్పష్టం చేశారు



సభలో మాట్లాడుతున్న గంటేడ గౌరునాయుడు

తెలుగు సాహిత్యం వైపు విద్యార్థులు ఆసక్తి చూపాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తెలుగు సాహిత్య సృజన వైపు విద్యార్థులు ఆసక్తి చూపించాలని ప్రముఖ కవి గంటేడ గౌరునాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ అధ్యక్షులు డి.రామయ్య అధ్యక్షతన 'కథా రచన అవగాహనా కార్యశాల' ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గంటేడ, ప్రముఖ కథా రచయిత మల్లిపురం జగదీష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కథ ఎలా రాయాలో విద్యార్థులకు వివరించారు. సామాజిక స్పృహ కలిగి చూసిన సంఘటనకు వాస్తవిక రూపం కల్పించి చక్కటి వాక్య నిర్మాణంతో పాఠకున్ని ఆలోచింప గలిగేలా చదించగలిగేటట్లు చేయడమే రచయిత ముఖ్యోద్దేశం కావాలని చెప్పారు. కథ రచనలో తమ అనుభూతులను విద్యార్థులతో పంచుకున్నారు. అనేక కథలను వివరిస్తూ కథ శిల్పాన్ని విద్యార్థులకు వివరించారు. గంటేడ రాసిన చక్కని పాటలను జగదీశ్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు గుడ్ల హరిప్రసాద్ ఆలపించారు. ప్రిన్సిపల్ డాక్టర్ టి.శ్రీవరం చైతన్యం కలిగి కథ రచన వైపు మళ్ళాలని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ఐ క్యు ఎసి కో ఆర్డినేటర్ కల్పన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువైద్య సేవల్లో జిల్లా ఫస్ట్

పశు వైద్య శాఖ జెడి మన్మథరావు


ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం:

మన్యం జిల్లాలో పశు వైద్య సిబ్బంది కొరత ఉన్నప్పటికీ సేవలందించడంలో మాత్రం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్నట్లు పశు వైద్య శాఖ జెడి ఎస్.మన్మథరావు తెలిపారు. గుమ్మలక్ష్మీపురంలో కొత్తగా ప్రారంభించిన పశు వైద్యశాల భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 3,600 మంది గోశాలలకు దరఖాస్తులు చేసుకోగా, 1,218 నిర్మించినట్లు చెప్పారు. జిల్లాలో 500 మెట్రిక్ టన్నుల పశుదాణా వచ్చిందన్నారు. 50 శాతం రాయితీపై రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. బస్తా ఖరీదు రూ. 1110 ఉండగా రైతులకు రూ.555కు మాత్రమే అందించినట్లు చెప్పారు. 75 రాయితీపై పశుదాణా, విత్తనాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. జిల్లాలో 38 మంది పశు వైద్యులు ఉండాల్సి ఉండగా కేవలం 18 మంది మాత్రమే ఉన్నారని, 20 పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. పశువుల దాహార్తిని తీర్చేందుకు గ్రామాల్లో 500 పశుతొట్టె నిర్మాణాలను చేపట్టినట్లు చెప్పారు. వ్యాక్సినేషన్ కార్యక్రమం చురుగ్గా జరుగుతున్నట్లు చెప్పారు.

చైతన్యస్ఫూర్తి నారాయణమూర్తి : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరురూరల్

సమాజంలో జరిగే మార్పులను, అసమానతలను, మోసాలను నిరంతరం ప్రజలకు తెలియజేయడానికి తన చిత్రాల ద్వారా దశాబ్దాల కాలంగా పనిచేస్తున్న విలక్షణ వ్యక్తి దర్శకుడు, నటుడు ఆర్ నారాయణ మూర్తి అని మాజీ ఉప ముఖ్య మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో సినీనటుడు ఆర్.నారాయణ మూర్తి కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సినీ పరిశ్రమలో అరుదైన వ్యక్తిత్వం ఉన్న వారిలో నారాయణమూర్తి ఒకరని, నటుడిగా ప్రారంభమైన ఆయన ప్రయాణం ప్రజా సమస్యలను చాలా మంది వివిధ రూపాల్లో తెలియజేస్తే నారాయణమూర్తి మాత్రం ఎవరూ చేయని విధంగా వెండితెరపై ప్రతిబింభించే దర్శకునిగా, నిర్మాతగా సామాజిక చైతన్యాన్ని, న్యాయాన్ని తన సినిమాల్లో చూపించి ప్రజలను చైతన్యవంతులుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, కురుకుట్టి ఎంపిటిసి సభ్యులు గెమ్మెల సుబ్బారావు తదితరులు ఉన్నారు.



రాజన్నదొరను కలిసిన సినీనటుడు నారాయణమూర్తి

ఒకే ఆవరణలో మూడు పాఠశాలలు

- గందరగోళంగా తరగతులు
- ఆరుబయట మూత్ర విసర్జనలు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఒకే పాఠశాల ఆవరణలో అక్కడ మూడు పాఠశాలలు నిర్వహిస్తున్నారు. అరొకర గదుల్లోనే ఈ మూడు పాఠశాలలు నిర్వహించడంతో విద్యాబోధన సమయంలో గందరగోళంగా మారుతోంది. దీంతో పాఠాలు అర్థం కాక అటు విద్యార్థులు, బోధించేందుకు ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. పాఠశాలలో మరుగుదొడ్లు లేకపోవడంతో మూత్రవిసర్జనకు విద్యార్థులు రోడ్డు మీదకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి తోడు పాఠశాల కూడా శిథిలావస్థకు చేరుకుంది. ఇటువంటి పరిస్థితి మండలంలోని మామిడిపల్లిలో చోటు చేసుకుంది.

మండలంలోని మామిడిపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, అంగన్వాడీ-1, 2 సెంటర్లు నిర్వహిస్తున్నారు. అరకొర వసతితో పాటు తరగతి గదులు శిథిలావస్థలకు చేరడంతో చాలా వరకు నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో ఉన్న నాలుగు గదుల్లోనే అన్ని రకాల తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులకు ఏం బోధిస్తున్నారో ఉపాధ్యాయులకు తెలియడంలేదు. అలాగే ఉపాధ్యాయులు ఏం చెబుతున్నారో విద్యార్థులకు అర్థం కాక గంగదరగోళ పరిస్థితి ఏర్పడింది. ప్రాథమిక పాఠశాలలో 59 మంది విద్యార్థులు, రెండు అంగన్వాడీ కేంద్రాల్లో 42 మంది బాలలు ఉన్నారు. ఉపాధ్యాయులు 5, అంగవాడీ కార్యకర్తలు, హెల్పర్లు నలుగురు ఉన్నారు. వీరు కూర్చోడానికి కనీసం ఎటువంటి గదుల్లేవు. ముఖ్యంగా ఇక్కడ ఉపాధ్యాయులంతా మహిళలే. వీరికి కనీసం మరుగుదొడ్లు లేకపోవడంతో చాలా ఇబ్బందులకు గురైవుతున్నారు. మధ్యాహ్న భోజన వసతి, వంటగది, సరుకులను నిల్వ ఉంచుకొనేందుకు గదులు లేవు. దీంతో ఈ స్టాకును విద్యార్థుల బోధనా తరగతి గదుల్లోనే ఉంచాల్సిన పరిస్థితి ఉంది.

శిథిలమైన పాఠశాల

ఈ పాఠశాల సుమారు 20, 30 ఏళ్ల కిందట నిర్మించారు. దీంతో తరగతి గదులు పెచ్చులూడి, మెట్లు విరిగి దెయ్యాల గదుల్లా కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో నాడు- నేడుకు ఈ పాఠశాలను ఎంపిక చేయకపోవడంతో అభివృద్ధికి నోచుకోలేదు. అలాగే రెండేళ్ల క్రితం అంగన్వాడీ భవన నిర్మాణానికి నిధులు మంజూరైనా శ్లాబ్ వేయకుండా మధ్యలో విడిచి పెట్టేశారు. దీంతో వారికి కూడా ఈ పాఠశాలలోని పాత గదిలోనే కొంత భాగం ఇవ్వాల్సి వచ్చింది. ఈ పాఠశాల గ్రామం మధ్యలో ఉండడంతో వర్షం పడితే గ్రామంలోని మురుగునీరంతా ఈ పాఠశాల ఆవరణలోకి చేరి నిల్వ ఉంటోంది. వర్షాకాలమైతే విద్యార్థులు పాఠశాల గదుల్లోకి వెళ్లడానికే తీవ్ర అవస్థలుపడుతున్నారు. 20 ఏళ్ల కిందట నిర్మించిన పాఠశాల ప్రహరీ గోడ హుదూద్ తుఫానులో పూర్తిగా కూలిపోయింది. కనీసం ఈ గోడనైనా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు రక్షణ లేకుండా పోయింది. ప్రహరీగోడ లేకపోవడంతో పశువులు, కుక్కలు, పందులు పాఠశాల ఆవరణలోనే నిత్యం సంచరిస్తున్నాయి. దీంతో విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలోనూ, సాయంత్రం ఆడుకొనేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే గ్రామంలో ఏ శుభకార్యాలైన ఈ పాఠశాల ఆవరణలోనే నిర్వహించడంతో భోజనాల అనంతరం చెత్తాచెదారాలను, పొయ్యిలకు ఉపయోగించిన రాళ్ల, ఇటుకలు ఇక్కడే వదిలేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.



మామిడిపల్లిలో ఒకే చోట నిర్వహిస్తున్న మూడు పాఠశాలలు

మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు మూత్ర విసర్జనకు రోడ్లపైకి వస్తున్నారు. ఈ పాఠశాల మామిడిపల్లి మెయిన్ రోడ్డు, యూనియన్ బ్యాంక్ పరిసర ప్రాంతంలో ఉండడంతో ఇక్కడకు నిత్యం చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ రోడ్డు చాలా రద్దీగా ఉండడంతో విద్యార్థులు పాఠశాల దాటి మూత్ర విసర్జనకు బయటకు వస్తే ఏమవుతారోనన్న భయంతో విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వాలు స్పందించి ఈ పాఠశాలలకు అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, ప్రహరీ గోడను నిర్మించి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు సౌకర్యం లేకపోవడంతో రోడ్డుపైకి వెళ్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో చెప్పలేం. అలాగే తాగునీటి సౌకర్యం కల్పించాలి. ప్రహరీగోడ లేకపోవడంతో పాఠశాల ఆవరణలోకి జంతువుల సంచారం ఎక్కువ ఉండడంతో విద్యార్థుల చదువుకు అంతరాయం ఏర్పడుతుంది. కావున తక్షణమే ప్రహరీగోడ నిర్మించాలి.

బెవర మహాలక్ష్మి,
విద్యా కమిటీ చైర్మన్

పిల్లలకు తాగు లేకపోవడం దారుణం



ఈ పాఠశాలకు ఎంతో చరిత్ర ఉంది. అటువంటి ఈ పాఠశాలలో పిల్లలను చదివిస్తే మంచి ప్రయోజకులవుతారని నమ్మకం ఉండడంతో మా పాపను చేర్పించాం. ఇందులో పిల్లలు తాగడానికి మంచి నీళ్ల లేకపోవడం చాలా దారుణం. పాఠశాలకు ప్రహరీ గోడ చాలా ఏళ్ల క్రితం కూలిపోయింది. దీంతో చుట్టూ పక్కల ఉండే వారికి ఈ పాఠశాల ఒక విడిది గాను, సెలవు రోజుల్లో అసాంఘిక కార్యక్రమాలకు కేంద్రంగా మారింది. తక్షణమే అధికారులు స్పందించి పాఠశాలకు తాగునీటి సౌకర్యం, ప్రహరీగోడ నిర్మించాలి.

పిల్లా హేమలత,
విద్యార్థిని తల్లి

వర్షం పడితే పిల్లలను బడికి పంపడంలేదు



వర్షం పడితే పాఠశాల ఆవరణ అంతా బురదమయవుతుంది. దీంతో పిల్లలు చాలా ఇబ్బందులు పడుతుండడంతో బడికి పంపడం మానేశాం. ఈ పాఠశాల ఆవరణలోనే అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటికి కనీసం మెట్లు కూడా లేకపోవడంతో చిన్నారులు పైకి ఎక్కలేకపోతున్నారు. మూడు పాఠశాలలకు కనీసం ఇటువంటి మంచినీటి సదుపాయం లేదు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మంచినీటి సదుపాయం చేపట్టి, పాఠశాల మరమ్మతులు చేపట్టాలి.

లావేటి అనురాధ,
విద్యార్థి తల్లి



పశువైద్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

పశువైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని భద్రగిరిలో ఆర్ఐడిఎఫ్ నాబార్డ్ నిధులతో రూ.26.50 లక్షలు అంచనా విలువతో కొత్తగా నిర్మించిన గ్రామీణ పశు సంవర్ధక యూనిట్ కేంద్రాన్ని శుక్రవారం ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పశువుల ఆరోగ్య సంరక్షణకు ఈ పశుసంవర్ధక కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని, పాడి రైతులు ఈ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ మన్మథరావు, కురుపాం ఎడి సిహెచ్ దినాకుమార్, పశువైద్యాధికారి పి లక్ష్మణరావు, రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్, ఎఎంసి చైర్ పర్సన్ కళావతి, ట్రైకర్ బోర్డు డైరెక్టర్ లావణ్య, మండల కన్వీనర్ నరేష్, నాయకులు పాడి సుధా, భారతమ్మ, ఎంపీడీవో త్రివిక్రమరావు, పేరా సిబ్బంది, ఏ హెచ్ ఏ సిబ్బంది, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే రోగాలు దూరం

ప్రజాశక్తి - కొమరాడ

జ్వరాలకు ప్రధాన కారణమైన దోమలు వ్యాప్తిని నియంత్రించడంలో డ్రైడే కీలకమైందని జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని విక్రంపురంలో ఫ్రైడే-డ్రైడే జరుగుతున్న తీరును శుక్రవారం గ్రామ వీధుల్లో సందర్శిస్తూ ఇంటి పరిసరాలను పరిశీలించారు. చిన్న, చిన్న నీటి నిల్వలు ఎక్కడైనా ఉన్నాయా అని గమనించి గుర్తించిన వాటిని పారబోయించారు. ఇళ్లలో వాడుక నీరు పరిశీలించి త్వరగా వినియోగించి ఎప్పటికప్పుడు ఖాళీ చేసి ఆరవేయాలన్నారు. ఫ్రిజ్ వెనకాల ట్రేలను పరిశీలించి నీటిని తొలగించే ప్రక్రియ చేపట్టారు. జ్వర లక్షణాలతో ఉన్న చిన్నారి గృహ సందర్శన చేసి ఆరోగ్య పరిశీలన చేశారు. అనంతరం అక్కడ గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో రికార్డులు తనిఖీ చేసి మందులు, వైద్య పరీక్షల లభ్యతపై పరిశీలించారు. ఎన్‌సిడి సర్వేపై ఆరా తీసి దీర్ఘకాలిక రోగుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాల న్నారు. గ్రామంలో ప్రతి వారం తాగునీటి నాణ్యతా పరీక్షలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎపిడెమియాలజిస్ట్ డాక్టర్ కౌశిక్, వైద్య సిబ్బంది అనూష, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

పాచిపెంట: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండవచ్చునని ఇఒపిఆర్‌డి పి.మల్లేశ్వరరావు తెలిపారు. పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని పి.కోనవలసలో చేపడుతున్న పారిశుధ్య పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డి మాట్లాడుతూ ఈ పక్షోత్సవాల్లో ప్రజలను కూడా భాగస్వాములను చేసి పారిశుధ్యం పట్ల అవగాహన కల్పించడమే కాకుండా వ్యాధులు రాకుండా నివారించడం ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశమని ఆయన తెలిపారు. ముఖ్యంగా మురుగునీటి కాలువలు, మంచినీటి ట్యాంకులను శుభ్రపర్చి దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. అలాగే గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు డస్ట్ బిన్‌లు ప్రతి ఇంటికి అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, సర్పంచులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - సీతానగరం

కుట్టు మిషన్ల శిక్షణ కార్యక్రమాన్ని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం బ్యాచ్‌ల వారీగా 90 రోజుల కుట్టు మిషన్ శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బ్యాచ్‌లో 67 మందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. 50 రోజుల వరకు శిక్షణ పొందుతున్నారని, మిగిలిన రోజుల్లో కూడా శిక్షణ వినియోగించుకోవాలన్నారు. బిసి కార్పొరేషన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ ఉన్నారు.

బాబు పాలనలో మోసం గ్యారెంటీ : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

చంద్రబాబు నాయుడు నాయకత్వంలో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడల్లా ప్రజలు మోసపోతున్నారని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలో 20,21,22 వార్డుల్లో ఇంటింటికీ టిడిపి వంచన కార్యక్రమంలో భాగంగా తిరిగి అవగాహన కల్పించారు. ఏడాదిలోనే టిడిపి ప్రభుత్వం చేసిన మోసాలు, అరాచకాలు బట్టబయలయ్యాయని చెప్పారు. మిగిలిన నాలుగేళ్లలో ఇంకెన్ని మోసాలు వుంటాయో ప్రజలు గ్రహించాలని కోరారు. సూపర్ సిక్స్ హామీలతో మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత మొండిచేయి చూపించారని ఆరోపించారు. కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, ప్రచార విభాగం జిల్లా కన్వీనర్ గిరిరఘు, వైసిపి నాయకులు పిరిడి రామకృష్ణ, పిట్టా వాసు పాల్గొన్నారు.



గుంతలు పూడ్చడంతో శుభ్రంగా కనిపిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి

గోతులు కప్పించిన ఆర్అండ్ బి అధికారులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఉన్న గోతులను ఆర్అండ్‌బి అధికారులు శుక్రవారం పూడ్చారు. 'ప్రజాశక్తి'లో ఈనెల 14న ప్రచురితమైన గజానికొక గొయ్యి వార్తకు ఆర్ అండ్ బి అధికారులు స్పందించారు. ఈ మేరకు ఫ్లైఓవర్‌పై ఉన్న గోతులను కప్పడంతో ద్విచక్ర, భారీ వాహన చోదకులు, పాదచారులతో పాటు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే పట్టణంలోని మిగిలిన రోడ్లపై ఏర్పడ్డ గొయ్యిలను కూడా పూడ్చాలని వాహనచోదకులు కోరుతున్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని నీలకంఠపురం పంచాయతీలో గల సాలిడంగూడ నుంచి సిరికొండ వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆ గ్రామాల గిరిజనులు శుక్రవారం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి గుమ్మలక్ష్మీపురంలో గల ఆమె క్యాంప్ కార్యాలయం వద్ద వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రోడ్డు సౌకర్యం లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నామని, ఈ సమస్యపై ఎన్నోసార్లు అధికారులకు వినతి పత్రాల అందించినా ఎవరూ స్పందించిన దాఖలాల్లేవన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందింఇ రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి రోడ్డు మంజూరు అయ్యాలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని తెలిపారు.

కాగితాడలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కంబర సచివాలయం పరిధిలో గల కాగితాడలో శుక్రవారం స్థానిక వైద్యాధికారి సాయికుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడతలు, గర్భిణీలు, బాలింతలు, మధుమేహ, రక్తపోటు తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేలా పని చేయాలి

మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిపి

ప్రజాశక్తి - కురుపాం

మండల సర్వసభ సమావేశంలో ప్రజాప్రతినిధులు చర్చించిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు మాట్లాడుతున్నప్పుడు నీలకంఠాపురం సర్పంచ్ మన్మథరావు తమ పంచాయతీ పరిధిలో 150 మందికి తల్లికి వందనం పడలేదని, ఎందుకు పడలేదో పూర్తి వివరాలు ఇవ్వాలని అధికారులను కోరారు. కురుపాం సిహెచ్‌సి సూపరింటెండెంట్ కె.సందీప్ కుమార్ ఆరోగ్య శాఖకు సంబంధించిన వివరాలు తెలియజేయగా, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని మాట్లాడుతూ సిహెచ్‌సిలో బెడ్లు చాలక ఒక్కొక్క బెడ్ మీద ముగ్గురు, నలుగురు పేషెంట్లు చొప్పున ఉండవలసి వస్తుందని అసలే వాతావరణం మార్పు వల్ల జ్వరాల తీవ్రత చాలా ఎక్కువగా ఉందని అన్నారు. ఎక్కడికక్కడ ప్రజలు జ్వరాలతో ఇబ్బందులకు గురవుతున్నారని కావున సిహెచ్‌సి పక్కనే 90 శాతం నిర్మాణం జరిగి ఉన్న భవనాన్ని మిగతా 10 శాతం పనులు పూర్తిచేసి వెంటనే ప్రారంభించాలని కోరారు. అలాగే ప్రతి గ్రామంలోనూ వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి స్ప్రేయింగ్ నిర్వహించి జ్వరాలు బారిన పడకుండా ప్రజలకు ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని కోరారు. రావాడ రాంభద్రపురం పిహెచ్‌సి వైద్యాధికారి చీకటి శంకరరావు మాట్లాడుతూ తన పిహెచ్‌సి పరిధిలో గల ఆశ్రమ పాఠశాలల్లో, గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి స్ప్రేయింగ్ నిర్వహించి వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారి కె.నాగేశ్వరరావు మాట్లాడినప్పుడు నీలకంఠాపురం, జరడ సర్పంచులు ఎ.మన్మథరావు, వి.జ్యోతి ఇంతవరకు తమ పంచాయితీకి ఎరువులు రాలేదని, వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో ఎరువులు రాకపోతే ఎలా అని ప్రశ్నించారు. దీనికి ఎఒ స్పందిస్తూ ఎరువులు ఇండెంటి పెంటామని మరి కొద్ది రోజుల్లో వస్తాయని తెలిపారు. ఎంపిపి పద్మావతి స్పందించి ఖరీఫ్ సీజన్ ముమ్మరంగా ఉన్న నేపథ్యంలో అన్ని గ్రామాల్లో ఎరువులు ఉంచి రైతులకు అందేలా ఏర్పాటు చేయాలని సూచించారు. అటవీ శాఖ అధికారులు మాట్లాడుతున్నప్పుడు జరడ సర్పంచ్ జ్యోతి మాట్లాడుతూ తమ పంచాయతీలో ఏనుగుల దాడిలో మృతి చెందిన కుటుంబీకులకు ఇంత వరకు నష్టపరిహారం అందలేదని, అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకొని వారికి నష్టపరిహారం, అలాగే పంట నష్టపోయిన బాధిత కుటుంబాలకు కూడా పరిహారం అందేలా చూడాలని కోరారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రజా ప్రతినిధులను వారి పంచాయితీ పరిధిలో గల సమస్యలు అధికారులు దృష్టిలోకి తీసుకు వచ్చినప్పుడు వెంటనే పరిష్కరించిన చర్యలు చేపట్టి, ప్రస్తుతం ప్రజలు జ్వరాల బారినపడినందున వైద్య సిబ్బంది ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అలాగే పంచాయతీ కార్యదర్శులు అన్ని గ్రామాల్లోనూ పారిశుధ్య లోపం లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో తహశీల్దార్ కె.జయ, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ బివై నాగభూషణ రావు, జెడ్పిటిసి జి.సుజాత, వైస్ ఎంపిపి బి.అన్నాజీరావు, వివిధ శాఖ అధికారులు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.



విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎంపిపి పద్మావతి

పశువుల పెంపకం ద్వారా అధిక ఆదాయం

ప్రజాశక్తి - సీతంపేట

పాడి పశువుల పెంపకం ద్వారా లబ్ధిదారులకు అధిక ఆదాయం సమకూరుతుందని ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు అన్నారు. శుక్రవారం స్థానిక వైటిసిలో పాడి పశువుల పెంపకానికి సంబంధించిన పద్ధతులపై మహిళా సంఘ సభ్యులకు ఇచ్చిన శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతంపేట ఐటిడిఎ ద్వారా గిరిజన లబ్ధిదారులకు గోకులం పథకం ద్వారా పాడిపశువులను అందజేస్తామని, వాటిని సక్రమంగా వినియోగించుకుని లబ్ధిదారులు అభివృద్ధి పథంలో నడవాలని అన్నారు. వీటివల్ల లబ్ధిదారులకు అధిక ఆదాయం వస్తుందన్నారు. ఈ శిక్షణలో మేలు జాతి పాడి పశువుల ఎంపిక, పాడి పశువుల నిర్వహణ, పశుగ్రాస పెంపకం, గోశాల నిర్వహణ మొదలైన అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి మండలంలోని చిన్నబగ్గ, బొండి, దేవనాపురం, పెద్దగూడ, పెద్దబగ్గ గ్రామాలకు చెందిన మహిళా సంఘ సభ్యులు హాజరయ్యారు. కార్యక్రమంలో పిహెచ్ఒ ఎస్.వెంకట గణేష్, పశుసంవర్ధకశాఖ ఎడి బి.శ్రీనివాసరావు, వెలుగు డిపిఎం ఆర్‌వి రమణ, ఎపిఎం కమల కుమారి, వాసన్ సంస్థ ప్రతినిధి సంతోష్ ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ జీవితం సంతృప్తినిచ్చింది

ప్రధానోపాధ్యాయులు గోవిందరావు



ప్రజాశక్తి - పార్వతీపురం

గణిత శాస్త్రం బోధనలో అపారమైన అనుభవంతో కూడిన విద్యా బోధనతో ఉద్యోగ జీవితం సంతృప్తినిచ్చిందని డోకిశీల గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చొక్కాపు గోవిందరావు అన్నారు. ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయు సందర్భంగా 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడారు. వివరాలు మరిన్ని ఆయన మాటల్లోనే...

పార్వతీపురం మండలం తాళ్లబురిడికి చొక్కాపు రామ్మూర్తి నాయుడు, చిన్నమ్మి దంపతులకు నలుగురులో ఆఖరి సంతానంలో నేను జన్మించాను. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు స్వగ్రామంలో చదువుకొని ఇంటర్, డిగ్రీ బొబ్బిలి ఆర్ఎస్ఆర్‌కె రంగారావు కాలేజీలో చదివాను. శ్రీకాకుళం జిల్లాలో గురజాడ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో బిఇడి పూర్తి చేశాను. 1999 సెప్టెంబర్ 21న కొమరాడ మండలం ఉలిపిరి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా నా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమైంది. ఆ తర్వాత బాలుర నుంచి బాలికల ఉన్నత పాఠశాలగా తన హయాంలో మర్చారు. సుమారు అయిదారేళ్ల తర్వాత సొంత మండలం డోకిశీల ఆశ్రమ ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చాను. ఇక్కడ నుంచి ఏడేళ్ల తరువాత 2012లో పార్వతీపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చి, 2018 నవంబర్లో గ్రేడ్ -2 ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతిపై తిరిగి డోకిశీల గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చి ఉద్యోగ విరమణ వరకు విధులను ఇక్కడనే నిర్వహిస్తున్నాను. నా వద్ద చదువుకున్న గిరిజన విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఇంజినీర్లు, డాక్టర్లుగా స్థిరపడడమే కాకుండా తాను విధులు నిర్వహించే స్కూల్లోనే ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు పొంది గురు శిష్యుల బంధంతో గౌరవాన్ని పొందడం చాలా సంతృప్తిని ఇస్తుంది. ప్రధానోపాధ్యాయుడిగా తన హయాంలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతి ఏటా నూటికి నూరు శాతం దగ్గరలో ఉత్తీర్ణత సాధించేందుకు గట్టి కృషి చేశాను. నాడు నేడు నిధులతో డోకిశీల ఆశ్రమ పాఠశాల కొండను ఆనుకొని ఉండడంతో వరద నీరు ముప్పు లేకుండా 60 అడుగుల పునాదిని, రైలింగ్, రంగులు, మరుగుదొడ్లు, విద్యుద్దీకరణ వంటి పనులను రూ.24లక్షలతో ఆధునీకరణతో సుందరంగా తయారు చేయడం ఆనందాన్నిచ్చింది.

2022 ఉమ్మడి జిల్లాలో అప్పటి కలెక్టర్ హరిజవహర్‌లాల్ చేతుల మీదుగా ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డును, 2023లో మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయుల అవార్డును పొందడమే కాకుండా, ఆరుసార్లు ఐటిడిఎ పిఒల చేతుల మీదగాను ఉత్తమ పురస్కారాలు అందుకోవడం చాలా సంతృప్తినిచ్చింది. దేశ భవిష్యత్తు తరగతి గదిలో తీర్చిదిద్దుకుంటుందన్న ఆశయంతో విద్యాబోధనలో చేసిన ప్రతి గురువుకి గౌరవం దక్కేలా నాతోటి సహచరులు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆశిస్తున్నాను. పెద్ద కుమారుడు వంశీకష్ణ ఎంఎస్సీ యూఎస్ఏ లో చేసి అక్కడే స్థిరపడిగా, చిన్న కుమారుడు సాయికృష్ణ ఎంబిఎ ఐఐఎం చదివి, బెంగళూరులోని టివిఎస్ కంపెనీలో బ్రాండ్ మేనేజర్‌గా స్థిరపడ్డారు. ఇందుకు భార్య ఇందిరా కుమారి అన్నివేళలా సహాయ సహకారాలు అందించడంతో నా 26 ఏళ్ల సర్వీస్‌ను ఆనందంగా చేయగలిగాను. విశ్రాంతి అనంతరం ప్రశాంతంగా తమ కుటుంబ సభ్యులతో గడపాలని ఆకాంక్షిస్తున్నాను.



సెంటర్ లైటింగ్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

వీరఘట్టం అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మేజర్ పంచాయతీని అభివృద్ధి పరిచేందుకు అన్ని విధాల కృషి చేస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. శుక్రవారం వీరఘట్టం ప్రధాన రహదారి మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు సంబంధించి భూమి పూజలో పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో రూ.26 లక్షల అంచనాతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్వామి థియేటర్ దగ్గర నుంచి వట్టిగెడ్డ వంతెన వరకు 1250 మీటర్ల దూరంలో సుమారు 44 స్తంభాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే రహదారి మధ్యలో కలియుగ భీముడు కోడి రామ్మూర్తి నాయుడు విగ్రహంతో పాటు సువర్ణ అక్షరాలతో బోర్డు కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ జెఇ జగదీశ్వరరావు, కూటమి నాయకులు కర్నేని అప్పలనాయుడు, ఉదయాన ఉదయభాస్కర్, జామి లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు, పాలవలస లీలా ప్రసాద్, వండన సాయికుమార్, వి.రమేష్, కె.దుర్గారావు, ఎం.రాంకుమార్, డి.ప్రకాష్‌రావు, తూముల రమేష్, జంపు చంద్రశేఖర్, సుక్క శ్రీనివాసరావు, కె.పైడ్రాజు, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్ పేటలో శుక్రవారం మండల టిడిపి అధ్యక్షులు అడ్డాకుల నరేష్ ఆధ్వర్యంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి తిరిగి సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలు పంచుతూ ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ఐదేళ్ల పాలనలో జరగని అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే చేశామని, ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్, ఎఎంసి చైర్పర్సన్ కడ్రక కళావతి, ట్రైకార్ బోర్డు డైరెక్టర్ పువ్వల లావణ్య, కూటమి నాయకులు పాడి సుదర్శన్ రావు, పోలూరు శ్రీనివాసరావు, దామోదర్ రావు, లక్ష్మణరావు, వెంపటాపు భారతి, నిమ్మక సింహాచలం, దివాకర్, దొరబాబు, చిన్నా, బాల, నాగమణి, కృష్ణ పండా, వెంకట్రావు, దాసు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విద్యలో వెనుక పడొద్దు : డిఐఇఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

చదువులో వెనుక పడితే జీవితంలో ఏదో పోగొట్టుకున్నట్టవుతుందని, కావున విద్యార్థులు చదువుపై శ్రద్ధచూపాలని డిఐఇఒ వై.నాగేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఇలా చేస్తే జీవితం సుగమవుతుందన్నారు. గతంలో ఈ అవకాశాల్లేవని, ప్రస్తుతం ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందని, కావున వీటిని వినియోగించుకొని విద్యలో రాణించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా చదివి అటు తల్లిదండ్రులకు, ఇటు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని, ఎటువంటి సందేహాలున్నా వాటిని సరిదిద్దేలా బోధన చేయాలని అధ్యాపకులను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో పాటు కళాశాల ప్రిన్సిపల్ డిజిఎస్‌వి త్రినాథ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపిస్తే చర్యలు

ప్రజాశక్తి - కొమరాడ

గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే సంబంధిత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ ఎస్.రమేష్ హెచ్చరించారు. మండలంలోని గుమ్మడిలో చేపడుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీలోని పలు వీధుల్లో కాలువలు అధ్వానంగా ఉండడంతో పంచాయతీ కార్యదర్శి, సిబ్బందిపై ఎంపిడిఒ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ వీధులను పరిశీలించారు. అయితే కాలువల్లో మురుగునీరు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లడం, ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోవడం పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ బాధ్యతారాహిత్యంపై మండిపడ్డారు. ఒక సామాజిక బాధ్యతగా తమ విధులను నిర్వహించాలే తప్ప అసలు పారిశుధ్య పనులు పట్టడం లేదని ఆసహనం వ్యక్తం చేశారు. ఇలా అయితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మంచినీటి కొళాయిలులో బ్లీచింగ్ చల్లడంతో పాటు, ఎస్టీ వీధిలో ఉన్న మంచినీటి ట్యాంకును పరిశీలించారు. అంతరాష్ట్ర రహదారికి అనుకుని ఉన్న కాలువల్లో మురుగునీరు రోడ్డుపైకి రావడం, అలాగే వీధుల్లో నిల్వ ఉన్న మురుగు పేరుకుపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామసభ ఏర్పాటు చేసి పి-4 సర్వేలో అట్టడుగున ఉన్న కుటుంబాలను దత్తత తీసుకున్న వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. పి-4 సర్వేపై గుమడ, కొమరాడ, కోటిపాం గ్రామపంచాయతీలో సర్వే నిర్వహించినట్లు తెలిపారు. గుమడ లో 92కి గాను 21 మందిని, కొమరాడ 95 మందిలో 13 మందిని గుర్తించి మిగిలినవి సర్వే లో ఉన్నట్లు తెలిపారు. దారిద్ర్య రేఖకు దగ్గరగా ఉన్న కుటుంబాలను బంగారు కుటుంబంగా గుర్తించి దత్తత తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆయనతో పాటు ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ రమేష్

ఎస్ఒ సస్పెన్షన్ ఎత్తివేయాలి : గిరిజన సంఘం

ప్రజాశక్తి - పార్వతీపురం

సాలూరు మండలం కరాసువలస కెజిబివి స్పెషల్ ఆఫీసర్ ప్రశాంతి సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తి వేయాలని పలువురు గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గత ఏప్రిల్‌లో గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి ఆకస్మిక తనిఖీ చేసినప్పుడు భోజనం సరిగ్గా ఉడకలేదన్న కారణంతో అక్కడ ఎస్ఒ గా పనిచేస్తున్న జి.ప్రశాంతిను సస్పెండ్ చేయమని ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. కానీ విచారణ చేసిన కలెక్టర్, ఇద్దరు ఎంఇఒలు స్పెషల్ ఆఫీసర్ ప్రశాంతి తప్పు లేదని నివేదించారని తెలిసిందన్నారు. ఎస్ఒను బాధ్యురాలిని చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎస్ఒ సస్పెన్షన్‌కు కారణాలేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏదేమైనా ఆదివాసీ ఉద్యోగుల పట్ల కక్షపూరితంగా వ్యవహరించకుండా ఆమె సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఆదివాసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయని తెలిపారు .ఈ సమావేశంలో ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ నాయకులు మువ్వల అమర్నాథ్, గిరిజన సంక్షేమ సంఘ నాయకులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయి బాబు, గిరిజన విద్యార్థి సంఘం నాయకులు పల్ల సురేష్, గిరిజన అభ్యుదయ సంఘ నాయకులు ఆరిక చంద్ర శేఖర్, గిరిజన ఐక్య వేదిక నాయకులు ఆరిక విప్లవ కుమార్, ఎఐఎస్ఎఫ్ నాయకులు బి.రవికుమార్, టిఆర్ఎఫ్ నాయకులు ఇంటి కుప్పల రామకష్ణ, సింహాచలం, మండల గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

పంటలకు ఆర్గానిక్ సర్టిఫికెట్ పొందాలి

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన రైతులు పండించిన పంటలకు ఆర్గానిక్ సర్టిఫికెట్ పొందేలా ఉండాలని వెలుగు సంస్థ డైరెక్టర్ బి.సంజీవరావు పిలుపునిచ్చారు. మండలంలోని చిన్నబగ్గ పంచాయతీ పరిధిలో గల మోహన్ కాలనీలో వెలుగు అసోసియేషన్ ప్రోత్సహంతో గిరివికాసం ఎఫ్‌పిఒ పదో వార్షిక మహాజన సభ శుక్రవారం జరిగింది. ఈ సభకు ఎఫ్‌పిఒ అధ్యక్షులు కె. కన్రన్న, కోశాధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ మహాజన సభ అజెండా అంశాలు - సంఘం ఉద్దేశం, పాలకవర్గ పరిచయం, వార్షిక నివేదిక ఆమోదం, ఆడిట్ కాబడిన లావాదేవీలు, సంఘం చెర, స్థిర ఆస్తులు గూర్చి, 2024-25ఆర్థిక సంవత్సరంలో చేసిన వ్యాపార కార్యక్రమాలు, 2025-26 ఆర్థిక ప్రణాళిక, అంతర్గత ఆడిట్, సభ్యుల ఎంపికను చదివి వినిపించారు. అనంతరం సంజీవురావు మాట్లాడుతూ ఆర్గానిక్ సాగు చేసే రైతుల ఆదాయం పెరగాలని, ఖర్చు తగ్గాలని, పసుపు పంట పెరగాలని సూచించారు. పశువుల పెంపకం ద్వారా రైతుకు మంచి ఆదాయం వస్తుందన్నారు. సమావేశంలో 32 గ్రామాల నుంచి 230 మంది సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వెలుగు అసోసియేషన్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ క్రాంతికుమార్, ఏరియా కోఆర్డినేటర్లు సవర ఆనందరావు, వసంత, వెన్నెల, మిన్నారావు, కార్యకర్తలు జగ్గయ్య, మజ్జయ్య, పార్వతి, రామయ్య, రవికుమార్, కృష్ణారావు పాల్గొన్నారు.



పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

పశువులకు టీకాలు

ప్రజాశక్తి - సీతంపేట

వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై పశువులకు టీకాలు వేస్తున్నామని, కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని లైఫ్ లైవ్ స్టాక్ అసిస్టెంట్ విజయ్ కుమార్, అసిస్టెంట్ శంకర్రావు తెలిపారు. మండల కేంద్రమైన సీతంపేటలో పశువులకు వ్యాధి నిరోధక శక్తి టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువులకు ముద్ద చర్మ వ్యాధి, గాలి కుంటి వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలనికోరారు.

గోదాంలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక యూనియన్ బ్యాంకు పక్కన గోదాంలో శుక్రవారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో కొత్తకోట వెంకటరమణకు చెందిన గోనె సంచులు అగ్నికి ఆహుతయ్యాయి. గోడౌన్ వెనుక భాగం నుంచి మంటలు రావడం గమనించిన వెంకటరమణ పాలకొండ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. మంటలు ఎగిసిపడడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ మంటలు చూసిన వెంకటరమణ భార్య సౌజన్య స్పృహకోల్పై పడిపోయింది. వెంకటరమణ గోన సంచుల వ్యాపారం చేసుకుని జీవనాన్ని సాగిస్తున్నాడు. మంటల్లో గోను సంచులు కాలిపోవడంతో తాను ఎలా జీవనం సాగించాలంటూ రోధిస్తున్నాడు. కష్టించిన సంపాదించుకున్న లక్షలాది రూపాయలు ఆస్తి కాలిపోవడంతో బోరును విలపిస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేస్తున్నారు.



గోదాంలో ఎగిసిపడుతున్న మంటలు